

ఏం ఆశించకుండా ఎవరు ఎవరినయినా ప్రేమించగలరా? ఎవరి సంగతేమో గాని ఆ బుజ్జి కుక్కపిల్ల మాత్రం ప్రేమించగలదు. తనను రావద్దంటూ తరిమేసే పిల్లవాడికి దగ్గరగా చేరి ఆప్యాయంగా స్పర్శిస్తుంది. చుట్టూ ఉన్న మనుషులంతా పదేపదే అసహ్యించుకున్నా, ఇంట్లోకి రానీకుండా అడ్డుకున్నా ఆ ప్రాంతం నుంచి కదలకుండా ఉండిపోతుంది. చివరాఖరుకు తన అవసరాన్ని కల్పించుకొని ఆ ఇంట్లో సెటిల్ అయిపోయిన ఈ కుక్కపిల్ల వైనాన్ని హృదయాల్ని హత్తుకునే విధంగా ఆవిష్కరించిందీ కథ.



నందిగం కృష్ణారావు

# మనిషి లాంటి కుక్కపిల్ల



ప్రొద్దుటినించీ ఇల్లంతా హడావుడగా ఉంది.

ఆవేళ ఆదివారం. మా అన్నగారి అబ్బాయి పుట్టినరోజు. స్కూల్ లేకపోవడంతో పిల్లలంతా ఇంటికే వచ్చి వాణ్ణి గ్రీట్ చేస్తున్నారు.

మా చెల్లెల్ని వారం రోజుల్నించీ పోరిపోరి నాలుగేళ్ళ గుంటడు మా మేనల్లుడు ఋత్విక్ తల్లిని వెంటబెట్టు కొని వచ్చాడు. వాళ్ళు హైదరాబాద్ నించి వచ్చేసరికి ఉదయం పదిగంటలైంది. వాడెప్పుడూ నడవగా నే చూడలేదు. రావడం రావడం పరుగెత్తుకొంటూ వచ్చి మా అన్నయ్యగారి పెద్దబ్బాయికి డాష్ ఇచ్చి "విష్యు హాపీ బర్త్‌డే కుయ్యా" అన్నాడు.

వాడు ఇచ్చిన డాష్‌కు దిమ్మతిరిగిపోవడంతో మా అన్నయ్యగారి అబ్బాయి క్షణంసేపు ఏమీ మాట్లాడలేదు.

"అత్తమ్మా! మీతో ఈ కుక్కని తీసుకువచ్చారా?" అని అడిగాడు మా అన్నయ్యగారి రెండో అబ్బాయి.

అప్పుడు అందరి దృష్టీ వాడి వెంట బజార్లోంచి పరి గెత్తుకొచ్చిన కుక్కపిల్ల మీద పడింది. అది ఒక నెల పిల్ల. గోధుమ రంగులో ఉంది. దాని గెడ్డం కింద నొసటి మీదా తెల్లమచ్చలు ఉన్నాయి. ఒంటినిండా మురికిపట్టి అసహ్యంగా ఉంది. దాని తోక నిటారుగా జండా కర్రగా నిల్చుని ఉంది. అల్లరిమూక ఎవరో దానికి ఒక గులాబీ రంగు రిబ్బను ముక్క కట్టారు.

పరుగుపందెంలో గెలిచిన వాణ్ణి జండా పట్టుకొని ఆహ్వానిస్తున్నట్లుగా అది తోకాడిస్తూ మా మేనల్లుడి కేసి గెంతుతోంది.

"ఛీ పాడు కుక్క బయటకి కొట్టండి" అన్నారెవరో. ఇదే అదననుకొని మా మేనల్లుడు దాని వెంటపడ్డాడు. కాంపౌండ్ దాటి, గేటు బయటివరకూ దాన్ని తరిమాడు. అది మళ్ళీ రాకుండా ఉండాలనీ, గేటు వేసి పైకి ఎక్కి గొళ్ళెం పెట్టాడు. ఆ తరువాత గేటు దిగి చేతులు దులుపుకొంటూ వెనక్కి పరుగెత్తుకొచ్చాడు.

"ఏంట్రా టడీబేర్, నన్ను కుయ్యా అంటావా" అంటూ వెంటపడ్డాడు మా కుయ్యాగాడు.

"నువ్వే టడీబీర్... డాంకీ, మంకీ" అంటూ వాడికొచ్చిన జంతువుల పేర్లన్నీ ప్రయోగించడం మొదలు పెట్టాడు.

సందడి కాస్తా అల్లరల్లరిగా తయారైంది.

ఇంతలో ఎలా వచ్చిందో కానీ కుక్కపిల్ల మళ్ళీ ఇంట్లోకి వచ్చేసింది. అది ఈసారి తోకాడిస్తూ మా మేనల్లుడి వెంట వెంటే వుంటూ వాడే క్షణమైనా కదలకుండా ఉంటే వాణ్ణి నాకి దాని ప్రేమని తెలియచేసింది. ఈసారి వాడు దాన్ని చూడగానే వీధిలోకి తరమడానికి బదులుగా పట్టుకోవడానికి యత్నించాడు. అది తప్పించుకొంటూనే వాణ్ణి కవ్విస్తూ వీధిలోకి పరిగెట్టింది.

"మళ్ళీ వస్తే చెబుతా నీ సంగతి" అని హెచ్చరిస్తూ భుజాల మీదనుంచి జారిపోతున్న సస్పెండర్స్‌ని పైకి లాక్కున్నాడు మా మేనల్లుడు.

కుక్క గేటుకెదురుగా మునికాళ్ళమీద నిల్చుని వాడు లోపలికి ఎప్పుడు వెళ్తాడా అని ఆసక్తిగా చూస్తోంది.

"ఏయి నిన్నే"నని చూపుడు వేలుతో పాయింట్ చేస్తూ తిరిగి హెచ్చరించాడు వాడు.

"కుయి... కుయి..."మంటూ జాలి జాలిగా చూసింది వాడికేసి అది. అందుకు వాడి హృదయం కొంత చలించింది. "ఇదిగో మళ్ళీ వచ్చావంటే చూడు..." అన్నాడు కొంత మెత్తగా తిరిగి గేటు వేసి ఇంట్లోకి పరిగెత్తుకు వచ్చాడు. "గుడ్" అన్నాడు మా అన్నయ్య వాణ్ణి చూసి.

గేటు బయట కుక్కపిల్ల ఆశగా చూస్తూ అటూఇటూ తచ్చాడుతోంది.

పిల్లలు మళ్ళీ ఆటల్లో పడ్డారు.

వాళ్ళ ఫ్రెండ్ వెంకటేశ్ గేటు తీసుకొని వచ్చాడు.

వాడితోపాటూ కుక్కపిల్ల కూడా వచ్చింది. అప్పుడు అందరం భోజనానికి కూర్చుంటున్నాం. ఎందుచేతో కానీ ఆ వేళప్పుడు ఆ కుక్క పిల్ల ఇంట్లోకి రావడం ఎవరికీ ఇష్టంలేకపోయింది. తినకముందే అందరికీ కడుపులో దేవినట్లనిపించింది. "ఒరేయ్ ఋత్విక్, దాన్ని బయటకి వెళ్ళగొట్టు" అన్నాడు మా అన్నయ్య. అంతమంది పిల్లల్లో మా అన్నయ్య ప్రత్యేకించి మా మేనల్లుడికి ఈ పని పురమాయించడం, వాడికి సంతోషం కలిగించింది. కించిత్తు గర్వంగా కూడా ఫీల్ అయ్యాడు.

భుజాల వరకూ జారిపోయిన సస్పెండర్స్‌ని పైకి లాక్కుంటూ ఎంగిలి చేత్తో కుక్క పిల్లని విదిల్చాడు. కుక్కపిల్ల ఒక గెంతు గెంతి వాడి చేతిలోంచి రాలిన అన్నం మెతుకులు పడ్డ వేసు దూకి, నాలుక చాచి తినేసింది. అది గెంతిన తీరు వీడికెందుకో థ్రిల్లింగ్‌గా అనిపించింది. అందుచేత మరోసారి ఇంకోవేపు చేయి విదిల్చాడు. అప్పుడు కుక్క తన తోక చూసుకుంటున్నట్లుగా వెనక్కి తిరిగి ఒకసారి పల్టీ కొట్టి అటువేపు దూకి అక్కడ పడిన ఒకటిరెండు మెతుకులు నాకేసింది. ఆ తరువాత ఋత్విగాడి చేతికేసి నాలుక చాచి నడిచింది. వాడు చేయి పైకి ఎత్తి లాన్లోంచి గేటుదాటి వీధిలోకి పరిగెత్తాడు. అదికూడా వాడి వెనకే పరిగెట్టి, వీధిలో వాడికెదురుగా నిల్చొని వాణ్ణి ముందుకు కదలనివ్వలేదు.

వాడూ తప్పించుకోచూస్తున్నట్లుగా అటూఇటూ కదిలి దాన్ని కవ్వించాడు. అది వెయ్యి కళ్ళతో వాణ్ణి కనిపెట్ట సాగింది. ఉన్నట్టుండి చటుక్కున లోపలికి వచ్చి గేటు వేసేశాడు. వాడి తెలివికి మా ఇంటిల్లిపాదీ మురిసిపోయారు.

అయితే ఆ కుక్క పిల్ల మాత్రం విషాదంగా మూల్గింది.

మేమంతా భోజనాలు ముగించి కూర్చున్నాం. కుయ్యాగాణ్ణి గ్రీట్ చేయడానికి ఎవరో ఒకరు వస్తూనే ఉన్నారు. అలా ఎవరొచ్చినా వాళ్ళతో పాటూ ఆ కుక్కపిల్ల పట్టు వదలని విక్రమార్కుడిలా వస్తూనే ఉంది. ఋత్విక్‌గాడు గేటు బయట వరకూ దాన్ని తరుముతూనే ఉన్నాడు. ఒకవేళ వాడు ఏ కళనో ఉండి దాన్ని చూడకపోతే అది వాడి వెంట వెంటే తిరుగుతూ, దాని ఉనికిని చాటుకొనేది. అప్పటికీ వాడు దాన్ని పట్టించుకోకపోతే, తోకాడిస్తూ వాణ్ణి ఆప్యాయంగా నాకేది.

"ఛీ" అంటూ ఛీత్కరించుకొనేవాడు వాడు.

"పాడు కుక్క! ఎక్కడెక్కడ నోరు పెట్టి, ఏం తినొచ్చిందో... ముందు దాన్ని అవతలకి కొట్టండి" అని అసహ్యించుకొంది మా అమ్మ.

"పిల్లలు వాడి చుట్టూ చేరి కుక్క ముట్టిన వెధవ కంపు కొడుతున్నాడు" అని అల్లరి చేయసాగారు.

ఉక్రోషంతో వాడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ కుక్క ముండని పట్టుకు నలిపి చంపెయ్యాలనిపించింది. "చూడమ్మా!" అంటూ తల్లికి కంప్లైంట్ చేసి దొడ్లోంచి ఒక రాయి తీసుకొని దానికేసి విసిరాడు. ఆ రాయిని తప్పించుకొని అది తిరిగి వాడికేసి రెండు అడుగులు వేసింది. పిడికిలి బిగించి దాన్ని వీధిలోకి తరిమేశాడు. గేటు లోపల్నించి రాళ్ళు తీసుకొని దానికేసి విసిరాడు. అది కనిపించకుండా పరిగెట్టింది.

కేక్ తింటున్న వాళ్ళకేసి ఆశగా చూస్తూ, వెనుక కాళ్ళమీద నిల్చుని, చేతులు జోడించినట్లుగా ముందుకాళ్ళు ఎత్తిపెట్టి తోకాడించసాగింది. దాని బర్త్‌డే సెలబ్రేట్ చేస్తున్నట్లుగా మురిసిపోయింది.

"హమ్మయ్య" అని నిట్టూర్చి వెనక్కి తిరిగాడు వాడు.

ఒక రౌండ్ టేబుల్ తెప్పించి ముందు హాల్లో వేయించాడు మా అన్నయ్య. హాల్లో ఉన్న ఫర్నిచర్ లోపల పెట్టించాడు. టేబుల్ మీద ఒక తెల్లగుడ్డ పరిచాడు. కుయ్యాగాడి గురించి హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తెప్పించిన కేక్ టేబుల్ మధ్యలో పెట్టింది మా వదిన.

మా మేనల్లుడు, మా అన్నయ్యగారి రెండో అబ్బాయి కేక్ చూద్దం పేరిట టేబుల్ దగ్గరకు వెళ్ళి నెమ్మదిగా వేలు తగిలించి నోట్లో పెట్టుకొని 'బాగుంది' అన్నారు.

"అచ్చం నీలానే ఉందోయి. అదికూడా టడీబేరే" అన్నాడు పెద్దవాడు. కేక్ టడీబేర్ షేప్‌లో చూడ్డానికి ముద్దొచ్చేట్లుగా ఉంది.

టడీబేర్ గాడికి ఒళ్ళు మండిపోయింది. యుఆర్ డిఓజి డాగ్,... సిఎటి క్యాట్" అంటూ వాడు ఈ మధ్యన ఇంగ్లీషులో నేర్చుకొన్న జంతువుల పేర్లన్నీ కుయ్యాగాడికి ఆపాదించి తిట్టడం మొదలుపెట్టాడు.

"బర్త్‌డేకొచ్చి బావని తిడతావేంటిరా? సరదాగా ఆడుకోక" అంది మా చెల్లెలు.

"క్యాండిల్స్ తెచ్చి అక్కడ పెట్టండ్రా" అంది మా అమ్మ.

గొడవ మర్చిపోయి, క్యాండిల్స్ తెచ్చి అమర్చడంలో లీనమైపోయారు పిల్లలంతా.

చీకటి పడుతున్నకొద్దీ ఇంటికి వచ్చే పిల్లల సంఖ్య పెరిగింది.

ఇల్లంతా కోలాహలంగా తయారైంది. ఈ హడావిడంతా తనదేనన్నట్లుగా కుక్కపిల్ల ఇంట్లో చేరి తోకాడిస్తూ పిల్లల వెంటవెంటే తిరగసాగింది.

క్యాండిల్స్ వెలిగించిన తరువాత "హ్యాపీ బర్త్‌డే చైతన్యా" అంటూ పిల్లలంతా ఒక్కసారే గ్రీట్ చేశారు.

మా అమ్మ మనవణ్ణి దగ్గరకు తీసుకొని ముద్దు పెట్టుకొంది. అందరికీ కేక్ కట్‌చేసి పెట్టాడు వాడు. ఆ తరువాత పిల్లలంతా వాడికి కేక్ తినిపించారు.

క్రిందపడ్డ కేక్ ముక్కల్ని కుక్కపిల్ల, కాళ్ళ సందుల్లోంచి తప్పించుకొంటూ తినేసింది.

కేక్ తింటున్న వాళ్ళకేసి ఆశగా చూస్తూ, వెనుక కాళ్ళమీద నిల్చుని, చేతులు జోడించినట్లుగా ముందుకాళ్ళు ఎత్తిపెట్టి తోకాడించసాగింది. దాని బర్త్‌డే సెలబ్రేట్ చేస్తున్నట్లుగా మురిసిపోయింది. సందు చూసుకొని మా మేనల్లుడు తిరిగి ఒకటి రెండుసార్లు దాన్ని వీధిలోకి తరిమాడు. బయటకి వెళ్ళినట్టే వెళ్ళి అది వాడి వెనకే తిరిగి లోపలికి వచ్చేసింది. లాభంలేదని విసిగిపోయి ఊరుకున్నాడు వాడు.

గేటు తీయగానే కుక్కపిల్ల లోపలికి పరిగెత్తుకు వచ్చి మా అన్నయ్య పక్కన ధీమాగా నిల్చొని మొరగసాగింది. మా అన్నయ్య మనసులో ఎక్కడో దాని మీద కాస్త సాఫ్ట్ కార్నర్ చోటు చేసుకొంది.

రాత్రి తొమ్మిది గంటలవరకూ బర్త్‌డే పార్టీ జరిగింది. ఆ తరువాత పిల్లలంతా వెళ్ళిపోయారు. వెళుతున్న వాళ్ళందరి వెనకా కుక్కపిల్ల గేటువరకూ తోకాడించుకొంటూ వెళ్ళింది.

అలసిపోయిన మా మేనల్లుడు భోజనం చేయకుండా పడుకొని నిద్రపోయాడు.

గేట్ పక్కన ఉన్న పూడ్చేసిన బావి గోతిలో ఉన్న చెత్తని కెలుకుతోంది కుక్కపిల్ల. అది గమనించకుండా మా అన్నయ్య గేటు వేసేసి వచ్చాడు.

మేం అంతా భోజనాలు చేసి ఇహ పడుకుందామనుకొంటూ ఉండగా గేటు బయటనుంచి దొడ్లో గేటు పక్కనుంచి వీధిలో నడుస్తున్నవారి నీడలు కదులుతూ ఉండటాన్ని గమనించి కుక్కపిల్ల గోతిలోంచి బయటికి వచ్చి మొరిగింది.

"ఇది ఇక్కడే ఉందే" అంటూ మా అన్నయ్య తిరిగి వెళ్ళి గేటు తీసి దాన్ని బయటకు తరిమేశాడు.

రాత్రి పదిన్నర కావచ్చింది. మేం పడుకొని జ్ఞాపకాల్ని నెరమరేసుకొంటున్నాం. మా వదిన వంటింట్లో ఏదో సర్దుతోంది.

కుక్క అరుపులు వినిపించాయి.

"ఛీ పాడు కుక్క మళ్ళీ వచ్చినట్లుంది" అంటూ మా అన్నయ్య లేచి బయట లైట్ వేశాడు. గేటు అవతల ముగ్గురు మనుషులు ఉన్నారు. వాళ్ళని గేటు ముట్టు కోనివ్వకుండా కుక్కపిల్ల వాళ్ళ చుట్టూ తిరుగుతూ మొరుగుతోంది.

"ఎవరు" అని అడుగుతూనే మా అన్నయ్య గేటు దాకా వెళ్ళాడు.

"మీరా!" అంటూ దేవదానంగార్ని పలకరించాడు. ఆయనతోపాటు ఆయన స్నేహితులు ఇద్దరుఉన్నారు.

మా నాన్నగారు పోయినప్పటినుంచీ దేవదానంగారు మా పిల్లలందరికీ తాతయ్యలా మెలుగుతున్నారు. పిల్లల బర్త్‌డేకి తప్పనిసరిగా వచ్చి ఆశీర్వదించేవారు. ఆరోజు ఎందుకో బాగా పొద్దుపోయింది.

గేటు తీయగానే కుక్కపిల్ల లోపలికి పరిగెత్తుకు వచ్చి మా అన్నయ్య పక్కన ధీమాగా నిల్చొని మొరగసాగింది. మా అన్నయ్య మనసులో ఎక్కడో దానిమీద కాస్త సాఫ్ట్ కార్నర్ చోటు చేసుకొంది.

"మీరు రండి! అది ఏమీ చేయదు" అంటూ లోపలికి దారితీశాడు.

కుక్కపిల్ల వాళ్ళ పక్కన నడుస్తూ మొరగసాగింది.


వాళ్ళంతా ఇంట్లోకి వచ్చి కూర్చున్న తరువాత కూడా అది వాళ్ళని వదిలిపెట్టలేదు.

దాని నోటిదగ్గర కూడు లాగెయ్యటానికి వాళ్ళు వచ్చారేమోనన్నట్లుగా చూస్తూ "గుర్... గుర్" మనసాగింది. దేవదానంగారు కూర్చుంటూనే "ఇది బలే ఉషారుగా ఉందండీ పెద్దయితే మీకు దొంగల బాధ ఉండదు" అన్నారు.

మా అన్నయ్య ఒక క్షణం ఆలోచించి భార్యని పిలిచి "దీనికేదైనా పెట్టు" అన్నాడు.

అలా ఆ కుక్కపిల్ల తన అవసరాన్ని కల్పించుకొని ఇంట్లో సెటిల్ అయిపోయింది. ⊙

## మగాళ్ళల్లో కాస్త మార్పు వస్తోంది



చిలకపలుకల్లా నాలుగు పడికట్టు మాటలను ఏర్చికూర్చి నిరంతరం వినిపించే సినీతారలు భిన్నమైన గొంతుకలు కొన్నివున్నాయి. జీవితం పట్ల స్పష్టమైన అవగాహన, ప్రాపంచిక విషయ పరిజ్ఞానం మెండుగా కనిపించి, విని పించే మాటలు స్వంతవ్యక్తిత్వంలా భాగంగా వినిపించేవారిలో జయాబచ్చన్ ఒకరు. సినీజీవితానికి, నిజజీవితానికి తారతమ్యం స్పష్టంగా తెలుసుకుని మసిలే జయాబచ్చన్ భారతీయసమాజంలో స్త్రీ స్థానం గురించి వ్యథ చెందుతుంటుంది. కుటుంబంలో ఆమె ఓ ముఖ్యభూమిక అన్నది అందరికీ తెలియాలని ప్రయత్నిస్తుంటుంది. "ఇటీవల కాస్త మగవాళ్ళలో మార్పు వస్తోంది. సర్దుకుపోయే తత్వం అలవడుతోంది. వాళ్ల అహంభావాలను నిలదీసి ప్రశ్నించడం జరుగుతోంది. స్త్రీపురుషుల సంబంధాల్లోని బాధ్యతలను భాగస్వాములుగా భరించే ఆలోచన చేయగలుగుతున్నారు" అనే జయాబచ్చన తన భర్త అమితాబ్‌బచ్చన్ గురించి చెబుతూ "ఆయనకు ఆత్మవిశ్వాసం ఎక్కువ. కుటుంబవిషయాల్లో కాస్త అలజడి మొదలయినప్పుడు నువ్వు ప్రశాంతంగా ఉండు. నేను సరిదిద్దుతాను అంటారు. అలా చెప్పేటప్పుడు తనేదో నాకు సాయం చేస్తున్నట్టుగా అనిపించనివ్వరు. ఆయన ఎన్నోసార్లు మహిళల కష్టాలు నాతో ప్రస్తావిస్తుంటారు" అని అంటుంది. తల్లి ప్రేమ సునాయాసంగా దొరికేది కదా అని నిర్లక్ష్యంగా చూడకూడదు అన్నది జయాబచ్చన్ ఫిలాసఫీ. కుటుంబ బంధాల విషయంలోనూ ఇదే విషయాన్ని ఆమె ప్రస్తావిస్తారు. ఏ అనుబంధమైనా పరస్పర అవగాహన ... నమ్మకం...ప్రేమల మీదే నిలిచివుంటుంది అన్నది ఆమె గట్టి నమ్మకం.